క్లుప్తంగా

పెద్దమండ్యం ఎస్ఐగా పీవీ రమణ

పెద్దమండ్యం: పెద్దమండ్యం పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా పి. వెంకటరమణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న చలపతి బదిలీ కావడంతో గత కొన్ని రోజులుగా ఎస్ఐని నియమించలేదు. ఈ క్రమంలో మదనపల్లె తాలూకా పోలీస్ స్టేషన్‌లో– 2 ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న పివి రమణను పెద్దమండ్యం ఎస్ఐగా నియమిస్తూ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు ప్రజలు, పార్టీల నాయకులు సహకరించాలన్నారు. మండలంలో ఎక్కడైనా నాటుసారా తయారీ, విక్రయాలు, జూదం నిర్వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

డిపోను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మదనపల్లె సిటీ: ఆర్టీసీ డిపోను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం డిపోలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. డిపోకు నిత్యం ప్రయాణికులు వస్తుంటారన్నారు. డిపోను శుభ్రంగా ఉంచితే అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. టు టౌన్ పోలీసుస్టేషన్ రైటర్ రామమూర్తి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, పక్షోత్సవాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, ఆవశ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో సీఐ రేవతి ,ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

మిట్స్ అధ్యాపకుడి ఘనత


డాక్టర్ శివయ్యను అభినందిస్తున్న ప్రొఫెసర్లు

కురబలకోట: అమెరికా కాలిఫోర్నియాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ప్రచురించిన ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో మదనపల్లె సమీపంలోని అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ శివయ్యకు చోటు దక్కినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్, అడ్వైజర్ ఆర్అండ్‌డీ డాక్టర్ తులసీరామ్ తెలిపారు. 2024కు గాను ఇతను చేసిన పరిశోధనల ఆధారంగా ప్రపంచంలోని శాస్త్రవేత్తలలో టాప్– 2 శాతం సైంటిస్టుల జాబితాలో ఇతనికి చోటు కల్పిస్తూ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ జాబితాను విడుదల చేసినట్లు తెలిపారు.

నీటి సంఘం మాజీ అధ్యక్షుడి మృతికి నివాళి


సురేంద్ర బాబురెడ్డి (ఫైల్)

పెద్దతిప్పసముద్రం: మండలంలోని టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లికి చెందిన నీటి సంఘం మాజీ అధ్యక్షుడు సురేంద్ర బాబురెడ్డి (55) మృతికి పలువురు నివాళి అర్పించారు. అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. వందలాదిగా ప్రజలు, ఆత్మీయులు, బంధువులు తరలి వచ్చి కంటతడి పెట్టారు. మాజీ ఎమ్మెల్యే జీ.శంకర్‌తో పాటు పార్టీలకతీతంగా స్థానికులు, తాజా, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు నివాళులు అర్పించారు.

పీలేరు ఏపీఎంగా జవహర్‌బాషా

పీలేరు రూరల్ : పీలేరు ఏపీఎంగా ఎస్. జవహర్‌బాషా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఏపీఎంగా పని చేస్తున్న లక్ష్మణ్‌రెడ్డి పుంగనూరు డెయిరీకి బదిలీ అయ్యారు. శ్రీశైలంలో ఏపీఎంగా పని చేస్తున్న జవహర్‌బాషా మంగళవారం పీలేరు ఏపీఎంగా బాధ్యతలు చేపట్టారు. అలాగే ఇన్‌చార్జి ఏరియా కోఆర్డినేటర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

డ్రైవర్లకు సంక్షేమ చట్టం కావాలి

బి.కొత్తకోట: చిన్న వాహనాల డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం సంక్షేమ చట్టం తీసుకురావాలని లైట్ మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. మంగళవారం జరిగిన డ్రైవర్ల సమావేశంలో యూనియన్ వ్యవస్థాపకులు మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ డ్రైవర్ల భద్రత, ఆరోగ్య, విద్య, వైద్యం ఉచితంగా అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘ అధ్యక్షుడు బలరాంరెడ్డి, పి.లక్ష్మణరెడ్డి, వెంకటకృష్ణయ్య, అగ్రహల్లీ, రమణ, సురేష్‌రెడ్డి, హారూన్, నరసప్ప, నారాయణమూర్తి పాల్గొన్నారు.

ఏడీఎం మదనపల్లెకు బదిలీ

బి.కొత్తకోట: స్థానిక నగర పంచాయతీలో నాలుగేళ్లుగా విధులు నిర్వహిస్తున్న పట్టణ ప్రణాళిక విభాగం ఏడీఎం బి.చిన్న రెడ్డెమ్మను మదనపల్లె మున్సిపాలిటీకి బదిలీ చేస్తూ పట్టణ ప్రణాళిక విభాగం డైరెక్టర్ విద్యుల్లత ఉత్తర్వులు జారీ చేవబూరు. అనంతపురం ఆర్‌డీడీ కార్యాలయంలో పనిచేస్తున్న ఆమెను కొత్తగా ఏర్పడిన బి.కొత్తకోట నగర పంచాయతీలో విధులను అప్పగించారు. సుదీర్ఘకాలం పనిచేయడంతో ఆమెను ఇక్కడి నుంచి మదనపల్లెకు బదిలీ చేస్తూ తక్షణమే రిలీవ్ చేయాలని కమిషనర్‌ను డైరెక్టర్ ఆదేశించారు. కాగా చిత్తూరులో పనిచేస్తున్న జకీరాఖాతూన్‌ను బి.కొత్తకోట నగర పంచాయతీ ఏడీఎంగా బదిలీ చేశారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

- ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం
- విస్తృతంగా పరిశుభ్రత కార్యక్రమాలు


ఆర్టీసీ బస్టాండులో శుభ్రం చేస్తున్న ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ విద్యార్థులు

మదనపల్లె : పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యంగా జీవించగలుగుతామని జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురభి రమాదేవి అన్నారు. మంగళవారం సెప్టెంబర్ 24, ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో విద్యార్థుల సహాయంతో రోడ్డుపైన పడి ఉన్నటువంటి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ఏరి, మున్సిపల్ సిబ్బందికి అప్పగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడుతూ...ఉన్నత చదువులు చదువుతున్న నేటి యువతకు చదువు, విజ్ఞానంతో పాటు సమాజం పట్ల బాధ్యత, సేవా గుణం పెంపొందించాలనే లక్ష్యంతో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జాతీయ సేవాపథకం(ఎన్ఎస్ఎస్)ను ప్రారంభించారన్నారు. సమాజసేవలో విద్యార్థుల భాగస్వామ్యం పెంచడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రెడ్డెప్ప, మునేంద్ర నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

కలికిరిలో..

కలికిరి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ ఎంవీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సేవా భావం అలవరచుకోవాలని, దేశ భవిష్యత్తులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం కళాశాల ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

మదనపల్లె సిటీ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి అన్నారు. మంగళవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక చిత్తూరు రోడ్డులోని కాలేజీ ఆవరణంలో మొక్కలు నాటారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలన్నారు. కాలేజీ ఆవరణంలో చెత్త,చెదారం ఎత్తివేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రెసిడెంట్ నాగమల్లారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అరుణ్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ బస్టాండు, జెడ్పీ ఉన్నత పాఠశాల, కాలేజీ ఆవరణంను చెత్తాచెదారం ఎత్తివేసి పరిశుభ్రం చేశారు. కాలేజీలో జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మరింత సేవా భావంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జ్యోతి, అధ్యాపకులు మోహన్‌వల్లి, కుసుమప్రియ, మోహన్‌బాబు, ఖాజావల్లి తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ డే నిర్వహించారు. కాలేజీ ఆవరణం శుభ్రం చేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణమూర్తి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సేగు రెడ్డప్పరెడ్డి పాల్గొన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి

పీలేరు : విద్యార్థులు సేవాగుణం అలవర్చుకోవాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వై. వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పరిశుభ్రత, ప్రజారోగ్యంపట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి బి. బాలకృష్ణ, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్‌తో క్రమశిక్షణ

బి.కొత్తకోట: ఎన్ఎస్ఎస్‌తో విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవడుతుందని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ నాయక్ అన్నారు. మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ఇందులో చేరిన విద్యార్థులకు ప్రజలకు సేవ, శ్రమదానం చేయడం అలవడుతుందన్నారు. ప్రతి విద్యార్థి మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ వెంకటేష్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచి సమాజ సేవలో పాల్గొనాలి

వాల్మీకిపురం: విద్యార్థి దశ నుంచి సమాజ సేవలో పాల్గొనాలని స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశులు తెలిపారు. మంగళవారం స్థానిక కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఎన్ఎస్ఎస్ వలంటీర్లుగా సమాజ సేవలో పాల్గొనాలన్నారు. ఎన్ఎస్ఎస్‌లో విద్యార్థి విలువలను, ఏ విధంగా మసులుకోవాలని తెలియజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి, అధ్యాపకులు నారాయణ స్వామి, జ్యోతి, ప్రవీణ్ కుమార్, పెద్దప్పరాజు, విజయలక్ష్మి, సుదర్శన్, సుబ్రమణ్యం, జయరామిరెడ్డి, శివశంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కలిచెర్లలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం

పెద్దమండ్యం: మండలంలోని కలిచెర్ల జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ డే (జాతీయసేవా పథకం దినోత్సవం) నిర్వహించారు. కళాశాలలో ప్రిన్సిపల్ నాయుని అమరేంద్రకుమార్ అధ్యక్షతన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం కళాశాల ఆవరణంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ వెంకటనరసయ్య, అధ్యాపకులు రవీంద్ర, ముస్తఫా, శ్రీను, వినాయకరెడ్డి, దావీదు, చిన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి


నిమ్మనపల్లెలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు

నిమ్మనపల్లె : వ్యవసాయంలో రైతులు అధిక దిగుబడులను సాధించి, లాభాలను ఆర్జించటానికి మేలైన యాజమాన్య పద్ధతులను అవలంబించాలని కృషి విజ్ఞాన కేంద్రం (కె వి కె) కలికిరి డాక్టర్ ఏ.శ్రీనివాసులు, మదనపల్లి వ్యవసాయ శాఖ ఏడిఏ శివశంకర్ అన్నారు. మంగళవారం వ్యవసాయ అధికారి మురళీమోహన్, ఉద్యానవన శాఖాధికారి ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి, రైతు సేవ కేంద్రం సిబ్బందితో కలసి మంగళవారం రెడ్డివారి పల్లి పంచాయతీ పిట్టావాండ్ల పల్లెలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈఓ లక్ష్మీ ప్రసన్న, ఆర్ఎస్ కే సిబ్బంది శ్రీకాంత్, రెడ్డి బాబు, మణికంఠ, రెడ్డి కుమారి, వెంకటేష్, రాజశేఖర్, కుమార్ నాయక్, మంజుల, జబీర్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలి

మదనపల్లె : రైతులు ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి నాగప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని బసినికొండ గ్రామం గంగన్నగారిపల్లె, వెంకప్పకోట పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులు పొలాలను సందర్శించి రైతులకు వివిధ పంటలకు సంబంధించిన సలహాలు, సూచనలు అందజేశారు.

పెద్దకురప్పల్లెలో పొలం పిలుస్తోంది

రామసముద్రం: మండలంలోని పెద్దకురప్పల్లె గ్రామంలో సర్పంచ్ రెడ్డెప్పనాయుడు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి పశుసంవర్ధకశాఖ డీడీ సత్యనారాయణ హాజరై మాట్లాడుతూ పశువులకు, గొర్రెలకు , మేకలకు సకాలంలో టీకాలు వేసుకోవడం వలన రోగాలను నివారించవచ్చునన్నారు. పాల దిగుబడి పెరిగేందుకు తగిన సూచనలిచ్చారు. వ్యవసాయ అధికారి మోహన్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు రెడ్డిశేఖర్, వెంకటరమణరెడ్డి, వేణుగోపాల్, చంద్రారెడ్డి, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి

కేవీపల్లె : పంటల సాగులో రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలని ఏఓ శ్రావణి అన్నారు. మంగళవారం కేవీపల్లెలో ×పొలం పిలుస్తోంది÷ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఆధునిక సాంకేతిక సమాచార పరిజ్ఞానం చేరువ చేసి వ్యవసాయ అనుబంధ శాఖల పథకాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. తక్కువ పెట్టుబడితో అధిక ఉత్పత్తి, ఎక్కువ ఆదాయం దిశగా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. రాయితీ ఎరువుల కోసం రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు.

ఆధునిక పద్ధతులపై అవగాహన

పెద్దతిప్పసముద్రం: మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ ప్రేమలత మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించడంతో పాటు వ్యవసాయంలో సాంకేతిక పద్ధతులపై గ్రామసభల్లో రైతులకు అవగాహన కల్పించడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు.

వారంలో ఇంటి బిల్లులు చెల్లింపు

–ప్రత్యేక అధికారి చంద్రశేఖర్‌రెడ్డి

బి.కొత్తకోట: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో పక్కా గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు వారంలో బిల్లుల చెల్లింపు జరుగుతుందని మండల ప్రత్యేకాధికారి, పీఆర్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులు సత్వరమే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లబ్ధిదారుల్లో అవగాహన కల్పించి, వారికి అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తామని భరోసా కల్పించాలని కోరారు. బిల్లుల చెల్లింపు సత్వరమే జరుగుతుందన్నారు. నిర్మాణ సామగ్రి సరఫరాతో పాటు ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఇసుక కూపన్లతో తరలించుకోవచ్చున్నారు. ఇంటినిర్మాణం కోసం ప్రతి లబ్ధిదారునికి ఐకేపీ సంఘాల ద్వారా రూ.35వేల రుణాన్ని మంజూరు చేయిస్తామని చెప్పారు. ఇళ్ల నిర్మాణాలు, లక్ష్యాలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బంది తీసుకోవాల్సిన చర్యలపై హౌసింగ్ ఈఈ వెంకటదాస్, డీఈ వెంకటరెడ్డి వివరించారు.

వడివడిగా అభివృద్ధి వైపు అడుగులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

నిమ్మనపల్లె : ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే రాష్ట్రం నియోజకవర్గం అభివృద్ధి వైపు వడివడిగా అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. మంగళవారం రెడ్డివారిపల్లె పంచాయతీ పిట్టావాండ్ల పల్లెలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా, మాజీ ఎంపీటీసీ నాగరాజ నాయుడు,ఆధ్వర్యంలో నిర్వహించిన పజా దర్బార్ కార్యక్రమం లో ఎమ్మెల్యే ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతి పత్రాలను స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో సిసి రోడ్ల నిర్మాణానికి రూ.3.5 కోట్ల నిధులను మంజూరు చేశామన్నారు. నిమ్మనపల్లె –మదనపల్లె డబుల్ రోడ్డు విస్తరణ పనులు త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నూతన కాలువ రెడ్డమ్మ, నాయకులు రెడ్డప్ప రెడ్డి, రాజన్న, శ్రీపతి, మల్లికార్జున, మల్లప్ప, మాజీ ఎంపీటీసీ నాగరాజు నాయుడు, లక్ష్మన్న, వెంకటరమణ, జనసేన ఉపాధ్యక్షుడు ఈతకట్ల చంద్రశేఖర్, తహసీల్దార్ ధనుంజయలు, ఎంపీడీఓ రమేష్ బాబు,తదితరులు పాల్గొన్నారు.

అంచెలంచెలుగా హామీలన్నీ నెరవేరుస్తాం

కలకడ : అంచెలంచెలుగా ప్రభుత్వం ఇచ్చిన హామీలు అన్నింటినీ నెరవేరుస్తామని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఎనుగొండపాళ్యం, బాలయ్యగారిపల్లె పంచాయతీలలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం బాలయ్యగారిపల్లె మాజీ ఎంపీటీసీ ఈశ్వరయ్య తండ్రి శ్రీనివాసులు ఇంటికి వెళ్ళి పరామర్శించారు. మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్‌నాయుడు, తిరుపతినాయుడు, రవిప్రకాష్ నాయుడు, సర్పంచ్ విశ్వనాథ, మాజీ సర్పంచ్ జనార్ద్‌న్‌నాయుడు, కాంతారాజ్ కరీముల్లా పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

తంబళ్లపల్లె: మండల కేంద్రంలోని నాగేంద్రవీధికి చెందిన వాసా భాస్కర్(48) సోమవారం సాయంత్రం మృతి చెందిన విషయం తెలిసిందే. వైఎస్సార్ సీపీలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు ఓదార్చారు. కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. స్థానిక నాయకులు మైనుద్దీన్ రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఆయన వెంటన మండల కన్వీనర్ చౌడేశ్వర్, కోఆప్షన్ సభ్యులు జమాల్‌బాషా, నాయకులు రామమూర్తి,జయనారాయణరెడ్డి, రామలింగారెడ్డి తదితరులు ఉన్నారు.

రోస్లిన్‌కు ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు



కురబలకోట: అంగళ్లులోని విశ్వం సీబీఎస్‌సీ స్కూల్ ప్రిన్సిపాల్ రోస్లిన్ ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఎంపిక య్యారు. ఇండియన్ కాంటెంపరరీ ఆర్ట్ అండ్ కల్చర్ సంస్థ నిర్వహించిన అవార్డులకు 30 మంది దరఖాస్తు చేశారు. స్కూల్ నిర్వహణ, నాయకత్వం , విద్యా రంగంలో నిరంతర కృషి తదితర కారణాల ఆధారంగా ఈ అవార్డును ఈమెకు అందజేశారు. విశ్వం విద్యా సంస్థల చైర్మన్ ఎం. ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పోటీ పరీక్షల్లో సత్తా చాటాలి


స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లె సిటీ: పోటీ పరీక్షల్లో ఉర్దూ విద్యార్థులు సత్తా చాటాలని ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా అన్నారు. రాష్ట్ర మైనార్టీ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో టెట్ ఉచిత శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. గత నెల రోజులుగా పొందిన శిక్షణ ద్వారా టెట్‌లో మంచి మార్కులు సాధించి టీచర్ పోస్టులను సాధించాలన్నారు. మైనార్టీలలో విద్యా చైతన్యం రావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీ సంస్థ ద్వారా ముద్రించబడిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో రూటా రాష్ట్ర నాయకులు పి.మహమ్మద్‌ఖాన్, టీడీపీ నాయకులు ఎస్.ఎ.మస్తాన్, విద్యాసాగర్, పాఠశాల హెచ్ఎం షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

విరబూసిన బ్రహ్మకమలాలు



తంబళ్లపల్లె: మండల కేంద్రంలోని వెంకటేశ్వరవీధిలో కోఆప్షన్ సభ్యులు జమాల్‌బాషా ఇంటి ఆవరణంలో సోమవారం రాత్రి బ్రహ్మకమలాలు విరబూశాయి. ఒకేసారి 42 పుష్పాలు పూయడంతో ఆశ్చర్యం కలిగించింది. ఈ పూలు చూడటానికి వీధిలోని ప్రజలు తిలకించారు. 10 ఏళ్ల క్రితం ఈ మొక్కను నాటగా ప్రతి ఏడాది వివిధ నెలలో మూడు సార్లు ఈ పూలు విరబూస్తున్నట్లు తెలిపారు.

27 నుంచి జిల్లా స్కూల్ గేమ్స్ జట్ల ఎంపిక

మదనపల్లె సిటీ: ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ జట్లు ఎంపిక ఈనెల 27వతేదీ నుంచి జరుగుతాయని ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ వసంత తెలిపారు. 27వతేదీ అండర్ –17 నెట్‌బాల్ బాల,బాలికల జట్టు సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతుందన్నారు.28వ తేదీన అండర్–17 బాల,బాలికల హ్యాండ్ బాల్ పోటీలు మదనపల్లె బీటీ కాలేజీ మైదానంలో , 30వ తేదీన అండర్–14 వాలీబాల్ బాల,బాలికల జట్లు మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతుందన్నారు. అక్టోబర్ 1వతేదీన అండర్–17 హాకీ బాల,బాలికల జట్లును సిటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపికలు జరుగుతాయన్నారు. ఉదయం 9 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. అండర్ –14 క్రీడాకారులు 01.01.2011 తరువాత అండర్ –17 క్రీడాకారులు 01.01.2008 తరువాత జన్మించిన వారు అయి ఉండాలన్నారు. ఎంపికకు వచ్చే క్రీడాకారులు సంబంధిత పత్రములతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9010534818ను సంప్రదించాలని కోరారు.

తారురోడ్డును తవ్వేశారు

- ఏడాదిన్నర క్రితమే వేసిన డబుల్ తారు రోడ్డు
- బిల్లులు పెండింగ్‌లోనే ఉండగానే కేబుల్ కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం


సైడ్ బ్యారర్‌కు లోపలి భాగంలోనే తవ్వేసిన దృశ్యం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మరకుంట సమీపం నుంచి టి.సదుం పంచాయతీలోని చెన్నరాయునిపల్లి క్రాస్ రోడ్డు వరకు గత వైఎస్సార్‌సీపీ పాలనలో డబుల్ తారు రోడ్డు పనులు చేపట్టారు. ఏడాదిన్నర క్రితం 10 కిలో మీటర్ల పాటు వేసిన ఈ కొత్త తారు రోడ్డును రూ.10 కోట్ల అంచనాతో పూర్తి చేశారు. అయితే ఇటీవల కేబుల్ వైర్లను భూమి లోపల పాతి పెట్టేందుకు కాంట్రాక్టర్లు కొత్తగా వేసిన తారు రోడ్డును ఇష్టారాజ్యంగా తవ్వేసారు. గుంతలో నుంచి తీసిన మట్టిని రోడ్డుపై వేయడంతో పలు చోట్ల డబుల్ రోడ్డు కాస్తా సింగల్ రోడ్డుగా మారిపోయింది. గ్రామాల్లో వేసిన సిమెంటు రోడ్లను కూడా డ్రిల్లింగ్ మిషన్‌తో తవ్వేసారు. అంతేగాక వాహనదారుల సూచికల కోసం రోడ్డుకు ఇరువైపుల భూమి లోపల నుంచి ఏర్పాటు చేసిన ఇనుప డిలేటర్‌లను పలు చోట్ల ఇష్టారాజ్యంగా తవ్వి పడేశారు. ముఖ్యంగా ప్రమాదకరంగా ఉన్న మలుపుల వద్ద, చెరువు కట్టల వద్ద ప్రమాదవశాత్తు వాహనదారులు జారి లోతట్టు ప్రాంతాల్లో కిందకు పడిపోకుండా ఉండేందుకు రోడ్డుకు ఇరువైపులా ఇనుప సైడ్ బ్యారర్‌లు ఏర్పాటు చేసినా కాంట్రాక్టర్ల కారణంగా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతోంది. సైడ్ బ్యారర్‌కు లోపలి భాగంగా లోతుగా జేసీబీలతో తవ్వేసారు. తద్వారా సైడ్ బ్యారర్ పటుత్వం కోసం భూమి లోపల వేసిన కంకర రాళ్ళు అన్నీ తేలిపోయాయి. రెండేళ్ళు కూడా అవ్వకనే రూ.కోట్ల ప్రజాధనంతో వేసిన తారు రోడ్డును ఈ విధంగా తవ్వేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రజలు, వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై ఆర్అండ్‌బీ జేఈ శ్రీనివాసులును వివరణ కోరగా సదరు తారు రోడ్డుకు సంబంధించి ఇంకా బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కేబుల్ కాంట్రాక్టర్లకు ఉన్నతాధికారులు అనుమతులు ఇచ్చి ఉన్నా షరతులతో ఇస్తారని రోడ్డుకు మీటర్ వదిలి తవ్వుకునేలా తమ వద్ద ఆధారాలు ఉంటాయన్నారు. ఆర్అండ్‌బి షరతులు ఉల్లంఘించి రోడ్లను ఇష్టారాజ్యంగా తవ్వితే కేసులు నమోదు చేయిస్తామని వెల్లడించారు.

త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి


ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న అధికారులు

పీలేరు : హౌసింగ్ పథకంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలు వచ్చే మార్చి లోపు వందశాతం పూర్తి చేయాలని జిల్లా ఎస్ఈ దయాకర్‌రెడ్డి, హౌసింగ్ డీఈ గోపాల్‌నాయక్ అన్నారు. మంగళవారం ఆయన హౌసింగ్ కాలనీలో ఇళ్ల నిర్మాణాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న స్థానిక కంకర ఫ్యాక్టరీ లేఅవుట్, ఏపీఐఐసీ లేఅవుట్ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంజనీరింగ్ అసిసెటంట్లు, మండల స్థాయి అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు పాల్గొని లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. మార్చి లోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకపోతే రద్దు అవుతాయని చెప్పారు. కార్యక్రమంలో డిస్టిక్ ఇండస్ట్రియల్ జనరల్ మేనేజర్ సూరిబాబు, ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఝురికోన ప్రాజెక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి


ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా

మదనపల్లె : పీలేరు నియోజకవర్గంలోని ఝురికోన ప్రాజెక్ట్ వాటర్ సప్లై కార్మికులకు చెల్లించాల్సిన 11 నెలల వేతనం తక్షణమే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. మంగళవారం మదనపల్లెలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ...12ఏళ్లుగా ఝురికోన ప్రాజెక్ట్ పరిధిలో వాటర్ సప్లై కార్మికులు 40మంది వరకు పనిచేస్తున్నారని, వారికి చెల్లించాల్సిన వేతనాలు నెలనెలా సక్రమంగా చెల్లించకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యధోరణి అవలంబిస్తున్నారన్నారు. 2023 నవంబర్ నుంచి నేటి వరకు వేతనాలు చెల్లించలేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీసవేతనం రూ.21వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం , ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి తిరుమల, దేవా, వెంకటరమణ, మురళి, కార్మికులు గుర్రప్ప, ఆనందకుమార్, రామాంజులు, రవి, నాగరాజు, మురళి, శివ, భరత్‌రెడ్డి, సుధాకర్, యర్రయ్య, భాస్కర్‌రెడ్డి, గురునాథ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ప్రపంచ నదుల దినోత్సవం


ఎన్‌సీసీ విద్యార్థులతో హెచ్‌ఎం సావిత్రి

వాల్మీకిపురం: స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చిత్తూరు 35వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ప్రపంచ నదుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం సావిత్రి మాట్లాడుతూ నదులు మనకు జీవనాధారం అని, ప్రపంచ ప్రఖ్యాత నాగరికతలన్నీ నదుల సమీపంలోనే ఏర్పడ్డాయన్నారు. నదులను పరిశుభ్రంగా ఉంచుకోవడం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం, నదీ మార్గాలు ఆక్రమణలకు గురి కాకుండా చూడటం మనందరి బాధ్యతన్నారు. ఎన్‌సీసీ కేర్‌టేక్ ఆఫీసర్ రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నదుల పరిరక్షణకు పాటుపడాలన్నారు. యువత జట్టుగా ఏర్పడి నదులు, కుంటలు, జలావాసాలలో పెరిగే కలుపు మొక్కలు, అడ్డంకులు శుభ్రం చేయటం అలవాటు చేసుకోవాలన్నారు.

మాలమహానాడు కార్యవర్గం ఎన్నిక

వాల్మీకిపురం: మాలమహానాడు వాల్మీకిపురం మండల అధ్యక్షుడిగా రెడ్డిరామ్, మండల యూత్ అధ్యక్షుడిగా ప్రవీణ్ కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు చింతపర్తి శివయ్య తెలిపారు. మంగళవారం స్థానిక మాలమహానాడు కార్యాలయంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు మాట్లాడుతూ మాలల ఐక్యత, వర్గీకరణ కోసం శ్రమిస్తామన్నారు. అనంతరం రాష్ట్ర అధికార ప్రతినిధి వీరభద్రయ్య, జిల్లా అధ్యక్షులు శివయ్యలు మాట్లాడుతూ వర్గీకరణపై వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఐకమత్యంతో పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు రమణప్ప, జయరాం, మహేష్‌బాబు, రవణ, శ్రీనివాసులు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవ ర్యాలీ

కేవీపల్లె : అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ సి. రాజమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని జిల్లేళ్ళమంద సెక్టారు పరిధిలో వడ్లకుంట సిబ్బాలవాండ్లపల్లెలో పౌష్టికాహార మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల పెరుగుదలకు పౌష్టికాహారం దోహదపడుతుందన్నారు. తృణదాన్యాల ఆవశ్యకతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శంకరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.